క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే



మాట్లాడుతున్న రీ సర్వే డీటీ

కార్వేటినగరం: భూ సమస్యలను పరిష్కరించేందుకే రీసర్వేలు నిర్వహించామని తహసీల్దార్ భగవతి అన్నారు. శనివారం కేశవకుప్పం సచివాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో చేసిన రీసర్వేలో లోపాలను గుర్తించడానికి గ్రామసభలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. రీసర్వే డీటీ స్వరూపరాణి, మండల సర్వేయర్ బాబు, వీఆర్వో గోపి, విలేజ్ సర్వేయర్ చరణ్‌తేజ, సర్పంచ్ జ్యోతి, నేతలు రవిరాజు, దొరస్వామిరాజు, లక్ష్మణరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



ర్యాలీ చేస్తున్న మహిళలు

పాలసముద్రం: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని మండల చైల్డ్ ఆఫీసర్ రాజ్ కుమార్ తెలిపారు. శనివారం పాలసముద్రం సచివాలయ ఆవరణలో శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ చెంచయ్య, గ్రామ సమాఖ్య సంఘ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలనపై మహిళలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. హెచ్‌ఎం వెంకటేష్, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



పరికరాలను అందిస్తున్న ఎమ్మెల్యే

కార్వేటినగరం: ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతులకు రాయితీపై డ్రిప్ పరికరాలను జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ పొన్నయుగంధర్‌తో కలసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టనుందని తెలిపారు. టీడీపీ నేతలు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను ఘనంగా సన్మానించారు. జిల్లా రైతు నాయకుడు నాగేశ్వరరాజు, మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, ఎంపీడీఓ చంద్రమౌళి, బీగాల రమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



భోజనం అందిస్తున్న దాత

నగరి : మండంలోని ఓజీ కుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మధు శనివారం నగరి పట్టణ పరిధిలోని శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మాధవ, మధు, నాగరాజ్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



విరిగిపోయిన స్తంభం పైభాగం

నగరి : స్థానిక బాలాజీ హైవే గార్డెన్ ప్రధాన వీధిలోని విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుంది. పైభాగం విరిగిపోయేందుకు సిద్ధంగా ఉంది. దీంతో స్థానికులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం సంభవించకముందే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం మార్చాలని కోరుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చిత్తూరు అర్బన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. శనివారం చిత్తూరు నగరంలోని పోలీసు అతిథిగృహంలో జరిగిన ఈ పోటీల్లో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర, ప్రస్తుత పరిస్థితుల్లో పోలీసులకు సవాళ్లు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. పలువురు ఇందులో పాల్గొని ప్రతిభ చూపించారు. విజేతలకు త్వరలోనే నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొలువు దూరమై.. బతుకు భారమై!

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో కొందరి పొట్టకొట్టింది. వైన్‌షాపుల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్‌లుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న వారి జీవితాలను వీధిన పడేసింది. పేద బతుకులను భారంగా మార్చేసింది. ఖజానా నింపుకునేందుకు ప్రైవేట్ వ్యాపారులకు కొమ్ము కాస్తోంది. చిరుద్యోగులకు ప్రత్యామ్నాయం చూపించకుండా అర్ధంతరంగా తొలగించింది. ఉపాధిని పోగొట్టి కష్టాల ఊబిలోకి నెట్టేసింది.

– కార్వేటినగరం

- నూతన మద్యం పాలసీతో వీధిన పడిన జీవితాలు
- ఉపాధి కోల్పోయిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్‌లు
- భరోసా కల్పించాలంటున్న బాధిత కుటుంబాలు

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది (ఫైల్)



కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పాలసముద్రం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఎక్కడా అవినీతికి తావు లేకుండా ఉండేందుకు సర్కారీ మద్యం దుకాణాలను నిర్వహించింది. అక్కడ సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్‌లు పోస్టుల కింద నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. ఇలా ఎక్సైజ్ సర్కిల్‌లో 84 మంది పనిచేశారు. గత వారం నుంచి కూటమి ప్రభుత్వం వీరిని రోడ్డు పడేసింది. నూతన మద్యం పాలసీ తీసుకువచ్చి వీరికి ఉపాధి లేకుండా చేసింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కోరుతూ వీరు ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్సైజ్ పోలీసులు, వివిధ శాఖలకు చెందిన అధికారులకు వినతి పత్రాలు అందించినా ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించలేదు. దీంతో ఉపాధి కోల్పోయిన వారు అనేక మంది అవస్థలు ఎదుర్కొంటున్నారు. చాలా మంది పేదరికంతో అల్లాడుతూ దుర్భర పరిస్థితిని అనుభవిస్తూ కంట తడిపెట్టుకుంటున్నారు. ఉన్నట్లుండి ఉద్యోగం కోల్పోవడంతో పిల్లలకు పాఠశాల ఫీజులు ఎలా చెల్లించాలో అర్థం కాక మథనపడుతున్నారు.

మొండి వైఖరి విడనాడాలి



ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పనిచేసిన ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి. ఉపాధిని కోల్పోయిన యువతపై మానవతా దృక్పథంతో ప్రత్యామ్నాయ అవకాశం కల్పించాలి. సీఎం చంద్రబాబు స్పందించి యువతకు ఉద్యోగాలు చూపించాలి.

– దొరబాబు, సూపర్‌వైజర్, కార్వేటినగరం మండలం

ప్రత్యామ్నాయం చూపాలి



నూతన మద్యం పాలసీ ప్రకారం తొలగించిన మాకు ప్రత్యామ్నాయం చూపించాలి. కొంతకాలంగా ప్రభుత్వానికి సేవలందించడంతో పాటు ఆదాయ వనరులను కాపాడామన్న దృక్పథంతో చూడాలి.ఉద్యోగాలు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవాలి. ప్రభుత్వం మాకు అండగా ఉండాలి.

– అయ్యప్ప, సూపర్‌వైజర్, పాలసముద్రం మండలం

ఉపాధి కల్పించండి



ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసిన మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఈ విషయమై అధికారులకు వినతి పత్రాలు అందించాం. మాపై వ్యతిరేక భావాన్ని వీడాలి. కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో 50 మంది పనిచేశాం. మా ఆకలి బాధలు అర్థం చేసుకోండి.

– శివ, సేల్స్‌మన్, పాలసముద్రం మండలం

'ఎంఐజీ' భూముల పరిశీలన



భూ పరిశీలనలో ఆర్‌డీఓ రామ్మోహన్

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలం ఎంఐజీ లేవుట్ పేరుతో తుడా తీసుకున్న 30 ఎకరాలను తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ శనివారం పరిశీలించారు. ఎస్వీపురం రెవెన్యూలో సర్వే నంబర్లు 428, 411లో ఇంటిపట్టాలు ఇచ్చేందుకు 2022లో తుడా తీసుకుంది. అయితే ఇంటి పట్టాలు ఇవ్వకపోవడంతో ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటున్నట్లు ఆర్‌డీఓ తెలిపారు. కార్యక్రమంలో డీటీ సుధీర్, సర్వేయర్ గురవారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములగుడి వీధిలోని జైన్ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

స్వప్నం.. ఫ్లైఓవర్ నిర్మాణం

- దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రయాణికులు
- పూడి రైల్వే గేటు వద్ద రాకపోకలకు తప్పని ఇక్కట్లు



గేటు వేసి ఉన్న పూడి రైల్వేగేటు (ఫైల్)

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలం పూడి రైల్వే గేటుపై ఫ్లైఓవర్ నిర్మాణం ప్రయాణికులకు కలగానే మిగిలిపోయింది. సుమారు రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నా ఫలించని పరిస్థితి. ఈ రైల్వే గేటు పడితే కనీసం అరగంట పాటు వేచి ఉండాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి 20 నిముషాలకు ఒక రైలు.

ఐదేళ్ల ముందు వరకు ఈ మార్గంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ప్యాసింజర్ రైల్‌తో పాటు కొన్ని ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లు తిరిగేవి. ప్రస్తుతం పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రతి 20 నిముషాలకు ఒక సారి గేటు వేస్తున్నారు. ఫలితంగా ద్విచక్రవాహనదారులు, మినీ లారీ, వ్యాన్, ఆటోవాళ్లు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

ఏళ్ల తరబడి నిరీక్షణ

పూడి రైల్వే గేటుపై ఫ్లైఓవర్ నిర్మించాలని స్థానికులు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు వారి ఆశలు నెరవేరేందుక ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఫ్లెఓవర్ నిర్మిస్తే వివిధ పనులు, వ్యాపారం నిమిత్తం తిరుపతి వెళ్లేవారికి ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. అలాగే చెన్నై–తిరుపతి హైవేపై రద్దీ తగ్గుతుంది. ఈ క్రమంలోనే తిరుచానూరు, అప్పలాయిగుంట ఆలయాలకు భక్తుల రద్దీ పెరుగుతుంది. కాయపేట, కాయం, బ్రాహ్మణపట్టు, పాడిపేట చుట్టుపక్కల గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశముంటుంది. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుంది.

వంతెన నిర్మించాలి



వడమాలపేట నుంచి పూడి మీదుగా తిరుపతికి వెళితే 5 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఖర్చుతోపాటు, సమయం ఆదా అవుతుంది. రైల్వే గేటు వేస్తే తిరిగి తెరవడానికి అరగంట వరకు పడుతుంది. ప్రభుత్వం ఇక్కడ తప్పనిసరిగా వంతెన నిర్మించాలి. – దాము, ఆర్‌బీఆర్‌పురం, వడమాలపేట

ప్రభుత్వం స్పందించాలి



నేను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. పుత్తూరు నుంచి పూడి మీదుగా తిరుపతికి ఆటో నడుపుతుంటా. తరుచూ రైల్వే గేటు వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. ఫైఓవర్ నిర్మిస్తే ఎంతో ఉపయోగకరం. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. – శాంతకుమార్, పుత్తూరు


దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం



వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడుతున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: దివ్యాంగుల ఆరోగ్య సమస్యలను పరిశీలించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం శుభపరిణామమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మజ అన్నారు. నగరంలోని తపోవనం వద్ద రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికాస్ విహార్ దివ్యాంగుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడు తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులచే ప్రత్యేక హెల్త్‌క్యాంప్ నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాలలో ఉన్న 35 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. అదే ప్రాంగణంలో ఉన్న అనాథ శరణాలయంలోని వృద్ధులను ఆప్యాయంగా పలకరించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. న్యాయమూర్తి భానుశేఖర్‌రెడ్డి, పాఠశాల నిర్వాహకులు ముత్యాలశెట్టి పాల్గొన్నారు.

కాశీబుగ్గకు జలకళ





నగరి మండలంలోని బుగ్గ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో దొనల నుంచి నీరు ప్రవహిస్తోంది. కొంత కాలంగా సక్రమంగా వర్షాలు కురవక దొనల నుంచి నీరు ఆగిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు రెండు దొనల నుంచి నీరు వస్తోంది. దీంతో ఆలయానికి వస్తున్న భక్తులు, అయ్యప్ప మాలధారులు పవిత్ర జలంలో స్నానమాచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.

– నగరి

కొత్త పింఛన్లకు వాత.. పాత వాటికి కోత

- కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు
- 50 ఏళ్లకే పింఛన్ అని కూటమి ప్రభుత్వం హామీ
- గత ప్రభుత్వంలో నిరంతరాయంగా దరఖాస్తుల స్వీకరణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్ పంపిణీ చేస్తున్న అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి (ఫైల్)



పాలసముద్రం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలుపైగా అవుతున్నా ఇంత వరకు కొత్త పింఛన్లు దరఖాస్తుల స్వీకరణకు నోచుకోలేదు. పాలసముద్రం మండలంలో మొత్తం 3,728 వివిధ రకాల పింఛన్లు ఉన్నాయి. అందులో నెల క్రితం 92 పింఛన్లు వివిధ కారణాలతో తొలగించారు. మండలంలో 12 పంచాయతీలకు 9 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. దీంతో అర్హులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకనేందుకు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే ప్రభుత్వం నూతన పింఛన్లు కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులైన వారు నిరాశతో వెనుదిరిగి తిరిగి వెళుతున్నారు.

నెలలు గడుస్తున్నా తెరచుకోని సైట్..

ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా నిలిచిపోయిన సైట్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్నవారు రేషన్ కార్డు కోసం సైట్ ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

ఉన్న పింఛన్ల తొలగింపు..

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు ప్రస్తుతం వస్తున్న పింఛన్లు అధికార పార్టీ నాయకులు కుట్రపన్ని ఇప్పటికే ఆయా మండలాల్లో టీడీపీ నాయకులు సూచించిన పింఛన్‌దారులను ప్రభుత్వం తొలగించింది. కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తుంటే, ఉన్న పింఛన్లను తొలగించడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

గత ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం వలంటీర్లు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసేవారు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు అయ్యేవి. ఈప్రక్రియ నిరంతరం కొనసాగేది. అయితే నేడు ఆపరిస్థితి లేదు. ప్రస్తుత ప్రభుత్వం సైట్ నిలిపివేసింది. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సైతం పింఛన్ మంజూరు చేయించాలంటూ ఎక్కువ శాతం మంది పేదలు అర్జీలు సమర్పిస్తున్నారు.

పింఛన్ తొలగించారు



నేను మగ్గం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3వేలు పింఛన్ తీసుకునేవాన్ని. ప్రస్తుతం కూటమి నేతల కారణంగా పింఛన్ తొలగించారు. ప్రతి రోజూ మగ్గం నేస్తున్న నేను ఎలా జీవించాలి.

– కుప్పారెడ్డి, కొళ్లికండ్రిగ

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



కొత్త పింఛన్ మంజూరుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. ఆన్‌లైన్ సైట్ ప్రారంభమైతేనే కొత్త దరఖాస్తులు తీసుకునేందుకు అవకాశం.ఈ విషయంపై ఉన్నతాధికారులు త్వరలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయిన వెంటనే కొత్త పింఛన్ దరఖాస్తులు స్వీకరిస్తాం. – కృష్ణమహేష్ రెడ్డి, పాలసముద్రం

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



జయరామయ్య పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా

విజయపురం : మండలంలోని కేశవపురం ఆదిఆంధ్రవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత జయరామయ్య (70) భౌతికకాయానికి మాజీ మంత్రి ఆర్‌కే రోజా శనివారం ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నిండ్ర: రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ డైరెక్టర్ జయశ్రీశ్యామ్ తల్లి ఎలిజబెత్ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆర్‌కే రోజా వెంటనే వారి నివాసానికి వెళ్లి ఎలిజబెత్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, జెడ్పీటీసీ సభ్యుడు పరంధామ, పార్టీ జిల్లా కార్యదర్శి మేరీ, కో–ఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, సర్పంచ్ బాబురెడ్డి, నాయకులు దామోదరం, సత్యరాజ్, మునికృష్ణారెడ్డి, శివయ్య, వీరయ్య, మునిరాజ్, సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

వసతుల కల్పన అవసరం



విశ్రాంతి గదిని పరిశీలిస్తున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు : పేద విద్యార్థులు చదువుకునే గురుకుల పాఠశాలలో మెరుగైన వసతుల కల్పన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర స్పష్టం చేశారు. శనివారం గోపాలకృష్ణాపురం గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం రుచి చూసి నాణ్యత పెంచాలని సూచించారు. వంట గది, నిత్యావసర వస్తువుల గది, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని కళాశాల ప్రిన్సిపల్ చంద్రకళను ఆదేశించారు. విద్యార్థులకు ఎల్లవేళలా పరిశుభ్రమైన, రుచికర భోజనం అందించాలని,మైదానంలో పెరిగిపోయిన గడ్డిని తొలగించాలన్నారు. అలాగే భద్రత పటిష్టతపై అప్రమత్తగా వ్యవహరించాలని కోరారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధిపై సామాజిక తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అదనపు పీడీ ఉమావాణి

నిండ్ర : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. డ్వామా అదనపు పీడీ ఉమావాణి మాట్లాడుతూ ఉపాధి పనులను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రికార్డులు పరిశీలించి పథకంలో దుర్వినియోగమైన రూ.4,446 మొత్తాన్ని రికవరీ చేసినట్లు వెల్లడించారు. వర్షాకాలం నేపథ్యంలో మొక్కల పెంపకం, ఇంకుడు గుంతల తవ్వకం, ఆవులు, గొర్రెల షెడ్లు నిర్మించుకోవాలని సూచించారు. కూలీలు వలస వెళ్లకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరి డివిజన్ ఏపీడీ సునీల్ కుమార్, ఎంపీపీ దీప, ఏఓ కృష్ణయ్య, ఎస్ఆర్పీ బుజ్జి, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీను, ఏపీఓ బబిత, ఈసీ శ్రీధర్, డీఆర్పీలు శివకుమార్, రాజేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా చంద్రమౌళి



చంద్రమౌళిని సత్కరిస్తున్న అధ్యాపకులు

పుత్తూరు: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ బి.చంద్రమౌళి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో అధ్యాపకుడు కోటేశ్వరయ్య ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో వైజాగ్‌లో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న చంద్రమౌళి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. నూతన ప్రిన్సిపల్‌ను అధ్యాపకులు కోటేశ్వరయ్య, వీరయ్య, నరసింహులు, వెంకటకృష్ణయ్య, వసంత్, కోటేశ్వరరావు, శ్రీదేవి, సుజన ఘనంగా సత్కరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి కథనం మేరకు, శనివారం చిత్తూరు–గుడిపాల దారిలోని మాపాక్షి కూడలి వద్ద ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాపాక్షికి చెందిన ఎం.మీనా (35) వద్ద 36 ప్యాకెట్ల కర్ణాటక మద్యం లభించింది. ఈమెకు మద్యం సరఫరా చేసిన నరిగిపల్లెకు చెందిన ఎం.బాలకృష్ణ (32)తో సహా ఇద్దరినీ అరెస్టు చేశారు. గుడిపాల మండలం పిళ్లారికుప్పం వద్ద తనిఖీలు చేస్తుండగా వెప్పాలచేనుకు చెందిన జె.లోకనాథం (53) వద్ద 21 ప్యాకెట్ల కర్ణాటక మద్యం లభించింది. ఇతన్ని కూడా అరెస్టు చేశారు. నిందితులు ముగ్గురినీ న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టి, ఆయన ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. దాడుల్లో ఎస్ఐలు మోహనకృష్ణ, పృథ్వీరాజ్, సిబ్బంది శరవణ, రాఘవయ్య, భాస్కరరాజు, ప్రసన్నకుమార్, లోకేష్, సంధ్య పాల్గొన్నారు.